**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

M.B.BHAVAN, 1-1-60/2,RTC X ROADS, HYDERABAD -20,
☎ 040-27665011, 27665012, Fax: 040- 27601001
E-mail: cpimap@gmail.com


**ప్రచురణార్థం:** **తేది: 13.02.2012**

ఉభయసభల సంయుక్త సమావేశంలో గవర్నర్ చేసిన ప్రసంగం వాస్తవ పరిస్థితులను మరుగుపర్చేదిగాను, ప్రభుత్వ వైఫల్యాలను, అసమర్థతను కప్పిపెట్టేదిగా వున్నది.

గత సంవత్సరం, ఈ సంవత్సరం రాష్ట్ర ప్రజలు కరువు వరదలతో తీవ్ర నష్టానికి గురయ్యారు. వ్యవసాయ పనులు లేక, ఉపాధి హామీ పనులు చూపకపోవడంతో వ్యవసాయ కార్మికులు సతమతమవుతున్నారు. రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైసా విదల్చలేదు. ప్రభుత్వం గత ఏడాదిలోనే పదివేల కోట్ల రూపాయలకు పైగా వివిధ రకాల భారాలను మోపింది. మద్యం మాఫియాలు ఏరకంగా ప్రజాజీవితాన్ని చిన్నాభిన్నం చేస్తున్నాయో వివరాలు రోజూ బహిర్గతమవుతున్నాయి. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపకుండా వాయిదాలు వేయిస్తూ, ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వం పరిహాసం చేస్తున్నది. స్కాలర్‌షిప్‌లను, ఫీజు రియంబర్స్‌మెంట్‌లను సకాలంలో చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నది. జూనియర్ డాక్టర్స్, 104 సిబ్బంది సమ్మెలను పరిష్కరించకుండా ఆరోగ్యశ్రీ వ్యవస్థలో హానికరమైన మార్పులు చేస్తూ ప్రభుత్వ వైద్యరంగాన్ని ధ్వంసం చేస్తున్నది. ప్రభుత్వ శాఖల్లో సంవత్సరాల తరబడి తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయకుండా ఖాళీలు భర్తీ చేసి లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెపుతూ తాత్కాలిక ఉద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నది. కరువు, వెనకబడిన ప్రాంతాల నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిచ్చే పద్ధతిలో నిర్ణయాలు తీసుకోకుండా కేటాయింపులు చేయకుండా వెనకబడిన ప్రాంతాల అభివృద్ధిని విస్మరిస్తున్నది. ప్రపంచబ్యాంకుతో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అభివృద్ధి ప్రాజెక్టు పేరుతో ఒప్పందం చేసుకొని, అది విధించిన షరతులను అమలు జరుపుతూ పట్టణ ప్రజలపై ఆస్థిపన్ను, నీటిపన్ను, చెత్తపన్ను ఇంకా అనేక రూపాల్లో భారాలు మోపుతున్నది. మురికి వాడల ప్రజలను ఊరిబైటకు వెళ్లగొడుతున్నది. ఇందిరమ్మ ఇళ్లు సగానికి పైగా ఇంకా మొండిగోడలుగానే మిగిలివున్నాయి. వాటిని నిర్మించేందుకు ఎటువంటి ప్రయత్నం ఇప్పటివరకూ చేయలేదు. కోస్టల్ కారిడార్ పేరుతో తీరప్రాంత రైతుల, మత్స్యకారుల జీవితాలను రోడ్డుమీద పడవేస్తూ ఉపాధి చూపకుండా సరైన నష్టపరిహారం ఇవ్వకుండా రాని పరిశ్రమల పేరుచెప్పి గొప్పగా ప్రచారం చేసుకుంటున్నది. విద్యుత్ కొరతతో, కోతలతో, నష్టాలతో విద్యుత్‌రంగం తీవ్ర సంక్షోభంలో వున్నప్పటికీ మర్చంట్ పవర్‌ప్లాంట్స్ పేరుతో ప్రయివేటు విద్యుత్ కంపెనీలకు ఊడిగం చేస్తూ సరైన విద్యుత్ విధానాన్ని రూపొందించడానికి ప్రభుత్వం నిరాకరిస్తున్నది. సోంపేట, కాకరాపల్లి రైతులకు భూములను తిరిగి అప్పగించడానికి నిరాకరిస్తున్నది. భారీగా విద్యుత్ చార్జీల పెంపునకు సన్నాహాలు చేస్తున్నది. ఎస్‌సి, ఎస్‌టి స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ నిధులను ఖర్చు చేయడానికి ఏర్పర్చిన నోడల్ ఏజెన్సీకి స్వయం ప్రతిపత్తి ఇవ్వడం గురించి అన్ని వైపుల నుండి విజ్ఞప్తులు వస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలో కౌలుదార్లు 25 లక్షలుంటే, 5.5 లక్షల మందికి గుర్తింపు కార్డులిచ్చి, 1.93 లక్షల మందికి మాత్రమే రుణ సౌకర్యం అందించడం కౌలుదార్ల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం విధితమౌతున్నది.

పై వాస్తవాలన్నింటినీ చెప్పకుండా అన్నీ సజావుగానే వున్నాయని అన్ని రంగాల్లో ప్రభుత్వం గొప్పగా పనిచేస్తున్నదనీ, ప్రజలను ఆదుకుంటున్నదని గవర్నర్ ప్రసంగంద్వారా చెప్పడం బాధలు పడుతున్న ప్రజలను అపహాస్యం చేయడమే. ముఠా కుమ్ములాటలతో సతమతమౌతూ, పదవులు నిలబెట్టుకోవడానికి, ప్రాపకాలు పొందడానికి, ఎత్తులు పై ఎత్తులు వేసుకోవడానికే పాలక పార్టీ నాయకులకు సరిపోతున్నది. బడ్జెట్ సమావేశాలను సజావుగా నడపడానికి ప్రభుత్వం పూనుకోదని గవర్నర్ ప్రసంగ ధోరణే స్పష్టం చేస్తున్నది. సమావేశాలను వృధా చేసే పాలకపార్టీ ప్రయత్నాలను సాగనీయకుండా ప్రభుత్వ వైఫల్యాలను బట్టబయలు చేసి ప్రజా సమస్యలను చర్చకు తేవడానికి ప్రతిపక్షాలన్నీ కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**(బి.వి.రాఘవులు)**
రాష్ట్రకార్యదర్శి